క్లుప్తంగా

శృంగార వల్లభుని దర్శనానికి భక్తుల బారులు


శృంగారవల్లభస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: పెద్దాపురం మండలం తిరుపతిలో కొలువైన శృంగార వల్లభుని ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేలాది భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అనేక గ్రామాల భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైస్ చైర్మన్–1 అధ్యక్షతన సమావేశం నిర్వహించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వైస్ చైర్‌పర్సన్–2 సునేత్రాదేవి

సామర్లకోట: మున్సిపాలిటీలో ఇద్దరు వైస్ చైర్‌పర్సన్లు ఉండడంతో సీనియర్ వైస్ చైర్మన్–1 ఊబా జాన్ మోజెస్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని వైస్ చైర్మన్–2 గోకిన సునేత్రా దేవి కోరారు. ఈ మేరకు శనివారం పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగు సురేష్‌కుమార్‌తో పాటు కొంత మంది కౌన్సిలర్లతో కలిసి ఆమె మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. తన సోదరి మృతి చెందడం వల్ల కౌన్సిల్ సమావేశానికి తాను హాజరు కాలేనని సునేత్రాదేవి కమిషనర్‌ను కోరారు.

రక్తపోటును నియంత్రించుకోవాలి

కాకినాడ రూరల్: అధిక రక్తపోటుతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ సువర్ణరాజు సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కోసం ఆందోళన, ఒత్తిడి, కోపతాపాలు, నిరాశ, నిస్పృహలు, ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల శరీరంలో పోటెత్తే నెత్తుటి వేగం అదుపు తప్పి అధిక రక్తపోటుకు దారితీస్తుందన్నారు. దీని నివారణకు శరీరక శ్రమతో పాటు ప్రతి రోజు నడక, వ్యాయామం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. బీపీ ఉన్న వారు మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లతో జీవితం నాశనం

కాకినాడ రూరల్: కొందరు యువకులు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, బెట్టింగ్‌లో సొమ్ములు కోల్పోయి దొంగలుగా మారి దోపిడీలకు పాల్పడుతున్నారని న్యాయవాది యనమల రామం ఆవేదన వ్యక్తం చేశారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తుండడంతో తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378

కల్యాణం కానిచ్చేసేలా!

- అరకొర వసతులతో టీటీడీ కల్యాణ మండపాలు
- ముహూర్తాల వేళ నిర్వహణ అస్తవ్యస్తం
- వేసవిలో మరింత ఆపసోపాలతో పెళ్లిళ్లు చేస్తున్న పెద్దలు
- ఏసీలు అమర్చాలని సర్వత్రా విన్నపాలు
- ఆధునిక హంగులతో మురిపిస్తున్న ప్రైవేటు వేదికలు


సామర్లకోటలోని టీటీడీ కల్యాణ మండపం

సామర్లకోట: దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీటీడీ కల్యాణ మండపాల నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఓ వైపు ప్రైవేటు కల్యాణ మండపాలు, విడిదిళ్లు ఆధునిక హంగులతో ఏర్పాటు చేస్తుంటే టీటీడీ కల్యాణ మండపాలు మాత్రం అదే పాత తరహా భవనాలు, కల్యాణ మండపాలతో పెళ్లిబృందాలను వెక్కిరిస్తున్నాయి. కల్యాణ మండపాల్లో డిజైన్లు, కుర్చీల అమరికలో ఆధునీకరణ, వేదికకు ప్రత్యేక హంగులు వంటివి అమర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరీ ముఖ్యంగా సహజంగానే వివాహ ముహూర్తాలు వేసవి, ఆ కాలానికి అటూ ఇటుగా ఉంటాయి. దీంతో ఈ కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకోవడానికి బుక్ చేసుకున్న వారు ఉక్కపోతలో, చెమటోడ్చుకుంటూ ఎంత త్వరగా పెళ్లి తంతు ముగుస్తుందా అనేలా త్వరగా తంతులు కానిచ్చేస్తున్నారు. ఈ మేరకు ఏసీ కల్యాణ మండలాలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రానున్న వైశాఖమాసంలో పెళ్లిళ్ల జోరు పెరగడంతో పేదలకు కల్యాణ మండపాలు అందుబాటులో ఉండటం లేదు. నియోజకవర్గ పరిధిలో సామర్లకోట బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌కు సమీపంలో, పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం, బస్సు కాంప్లెక్స్ ఎదురుగా టీటీడీ కల్యాణ మండపాలు ఉన్నాయి. వీటిని పంతం పద్మనాభం దేవదాయ శాఖా మంత్రిగా ఉన్న సమయంలో 1992లో శంకుస్థాపనలు చేసి 1997లో ప్రారంభించారు. విశాలమైన స్థలాలతో ఉన్న ఈ కల్యాణ మండపాలకు అద్దెలు కూడా నామమాత్రంగా ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉండేది. సామర్లకోట కల్యాణ మండపానికి రోజుకు రూ.2,500, పెద్దాపురం కల్యాణ మండపానికి రోజుకు రూ.రెండు వేలు అద్దె ఉండేది. విద్యుత్ బిల్లు అదనం. వేసవి ఎండల రీత్యా వాటిలోనే ఏసీలు ఏర్పాటు చేసి రూ.10 వేలు అద్దె వసూలు చేసినా బాగానే ఉంటుంది.


పెద్దాపురంలో టీటీడీ కల్యాణ మండపం

ప్రైవేటు మండపాల భారం..

ఏసీ ప్రైవేటు కల్యాణ మండపాలు రోజుకు రూ.60 వేల నుంచి రూ.2.4 లక్షలు అద్దెలు వసూలు చేస్తున్నాయి. అయినప్పటికీ సౌకర్యాలు అరకొరే. ఈ నేపథ్యంలో టీటీడీ కల్యాణ మండపాల నిర్వహణపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెడితే పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పెద్దాపురం కల్యాణ మండపం దిగువ భాగంలో భోజనాలు, మొదటి అంతస్తులో వివాహాలు నిర్వహించే ఏర్పాటుతో పాటు విశాలమైన ఆవరణ ఉండడం ప్రత్యేకం.

కల్యాణ మండపం లీజులో ఉంది

ఈ విషయమై టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ సామర్లకోట టీటీడీ కల్యాణ మండపం ప్రస్తుతం లీజులో ఉందని తెలిపారు. మరో మూడేళ్ల వరకు కళ్యాణ మండపానికి ఏ విధమైన ఆధునిక పనులు చేయడం కుదరదని వివరించారు.

అధికారులు స్పందించాలి



పేదలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో టీటీడీ కల్యాణ మండపాలను ఆదునీకరించాలి. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలలో నిర్మించిన కల్యాణ మండపాలు ముఖ్య కూడళ్లలో ఉన్నాయి. టీటీడీ కల్యాణ మండపంలో చేపలు, మాంసంతో భోజనాలు పెడుతున్నా పర్యవేక్షణ లేదు.
– పత్తి శ్రీను, చిరు వ్యాపారి, సామర్లకోట

ఏసీలు ఏర్పాటు చేయాలి



టీటీడీ కల్యాణ మండపాలకు రవాణా మార్గాలకు అందుబాటులో ఉండేలా నిర్మించారు. సామర్లకోట, పెద్దాపురం కల్యాణ మండపాలు దూర ప్రాంతాల ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ఏసీ కల్యాణ మండపాల వైపే మొగ్గు చూపుతున్నారు. రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే సరిపోతుంది. రూ.20 వేలు అద్దె నిర్ణయించినా భారం ఉండదు. సమాచార హక్కు చట్టం ద్వారా టీటీడీ దేవస్థానానికి ఏసీ ఏర్పాటుపై లేఖ రాస్తాం.
– పుట్టా సోమన్నచౌదరి, సమాచార హక్కు చట్టం జిల్లా సభ్యుడు, మర్రిపూడి

కోడి పందేలపై పోలీసుల దాడి

ఆరుగురి అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేలపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని కొమరగిరి శివారు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి ఒక కోడి, రూ. 1150 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ


దివిలిలో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

సామర్లకోట: ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు శనివారం పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. వంద అడుగుల జాతీయ జెండాతో భారతమాతాకి జై, మాతరం, మాతరం వందే మాతరం అంటూ నినాదాలు చేస్తూ కూటమి నాయకులు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబులు సైనిక వీరుల మృతికి సంతాపం తెలిపారు. సుమారు కిలోమీటరు పొడవున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎస్సై ఎ.మౌనిక, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో ‘ఏలేరు’

- రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి
- ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

సామర్లకోట: చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి వనరైన ఏలేరు కాలువ పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతోందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపించారు. ఏలేరు కాలువను కాలుష్యం నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. పెద్దాపురం మండల పరిధిలోని అనేక పరిశ్రమలు, రొయ్యల పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు ఏలేరు కాలువలో పంట పొలాల దెబ్బతింటున్నాయని, పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో చెరువులలో నీరు లేకపోవడం వల్ల పశువులు ఏలేరు కాలువలో నీటిని తాగుతున్నాయని వివరించారు. పరిశ్రమల నుంచి అధికారులు ముడుపులు అందుకోవడం వల్లే రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పరిశ్రమలను అధికారులు పర్యవేక్షించి భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కుంచే అంజిబాబు, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసిన రైతు కూలీ, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గీత
- పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు


వంగా గీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

పిఠాపురం: పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయా నాయకులు ఆమెను కలసి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాల్లో నిష్ణాతులైన కార్యకర్తలను నాయకులను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీపై నాయకుల్లో నమ్మకం విశ్వాసం పెంచినట్లైందన్నారు. పదవులు పొందినవారు నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని పెంచాలన్నారు. యూత్ వింగ్‌కు దాసం వెంకటేష్, మహిళా విభాగానికి జ్యోతుల వాణి, రైతు విభాగానికి గొల్లపల్లి సర్వారాయుడు, బీసీ సెల్‌కు పిఠాని కాశీ విశ్వనాథ్, ఎస్సీ సెల్‌కు పెదపాటి రమేష్ కుమార్, ఎస్టీ సెల్‌కు సింగం నాగేశ్వరరావు, మైనార్టీ సెల్‌కు సయ్యద మొహిద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు సందక శ్యామలరావు, స్టూడెంట్ వింగ్‌కు నల్లమిల్లి పవన్ కుమార్, పంచాయతీ రాజ్ వింగ్‌కు కర్నీడి సత్యనారాయణ, మున్సిపల్ వింగ్‌కు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, ఆర్టీఐ వింగ్‌కు పచ్చిమళ్ల అప్పలరాజు, వలంటీర్ల వింగ్‌కు గుల్లపల్లి గణేష్, గ్రీవెన్స్ సెల్‌కు నేతల సురేష్ కుమార్, వాణిజ్య విభాగానికి వర్దినీడి శ్రీనివాస్, వీవర్స్ వింగ్‌కు గోపి హరిబాబు, వైఎస్సార్ టీయూసీకి గింజాల రామకృష్ణ, అంగన్‌వాడీ వింగ్‌కు నరకుర్తి వెంకటలక్ష్మి, లీగల్ సెల్‌కు నల్లా రాజశేఖర్, కల్చరల్ వింగ్‌కు వేణుం నారాయణరావు, సోషల్ మీడియా వింగ్‌కు బోడపాటి రాజేష్, ఐటీ వింగ్ కందా దీప్తి, డాక్టర్స్ వింగ్ రంది కృష్ణ, ఇంటిలెక్చువల్ ఫోరం వడిశెట్టి సత్యనారాయణరెడ్డి, బూత్ కమిటీ వింగ్ కొత్తెం పశువులరావు, పబ్లిసిటీ వింగ్ గ్రంధి గణేష్ తదితరులు ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గండేపల్లి బాబీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రావుల మాదవరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మహిళా విభాగ అధ్యక్షురాలిగా వాణి


జ్యోతుల వాణితో వంగా గీత

కొత్తపల్లి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా విభాగ అధ్యక్షురాలిగా శనివారం నియమితులైన పొన్నాడ ఎంపీటీసీ జ్యోతుల వాణి మాజీ ఎంపీ వంగా గీతకు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛాంధ్ర


గ్రంథాలయం పరిధిలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

సామర్లకోట: ప్రతి ప్రాంతంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛాంధ్ర వైపు అడుగులు వేయడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రం వద్ద ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో అధికారులతో పాటు ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ మేరకు స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన దక్షిణామూర్తి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి వెంకట అప్పారావు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

బలుసులపేటలో..

స్థానిక బలుసులపేట ఇందిరా కాలనీలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో ఎమ్మెల్యే రాజప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కనకరాజు, మున్సిపల్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పంచారామ క్షేత్రం వద్ద రోడ్లు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

గ్రంథాలయ ఆవరణలో స్వచ్ఛ దివస్

సామర్లకోట: వేసవి శిక్షణలో భాగంగా పెద్దాపురం గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ రకాల శిక్షణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రంథాలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో తొలగించారు. ఈ మేరకు గ్రంథాలయాధికారి పాలంకి గంగ రాజు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు కౌన్సిల్ సంఘీభావం

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు శనివారం పట్టణ కౌన్సిల్ సంఘీభావం తెలిపింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 10 రోజులుగా రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలియజేసి రూ.13 వేల జీతం చేతికి వస్తే పెరిగిన ధరలతో ఏ విధంగా జీవిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని ఆయన హామీ ఇచ్చారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా సహకరించాలని వైస్ చైర్మన్ కార్మికులకు సూచించారు. ఈ మేరకు కార్మికుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు కౌన్సిల్ సభ్యులతో మాట్లాడుతూ 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగ వైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, యార్లగడ్డ జగదీష్, మర్రి శేషారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, కానేటి బుల్లి అప్పారావులు పాల్గొన్నారు. సమ్మెలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్మికులు పాలకుల మనసు మారి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.


సమ్మెకు సంఘీభావం తెలిపిన వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్: వ్యక్తిత్వ వికాస సమాజం, గ్లోబెల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్సు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వేసవి విశిష్ట మనోవిజ్ఞాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు జ్యోతిర్మనో విజ్ఞాన సంస్థ ప్రతినిధి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి శనివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వరకూ స్థానిక జీపీటీ మెహర్‌నగర్‌లోని వాధూలసంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు వి.జనార్దనం, ఎస్.మహాలక్ష్మికుమార్, వి.మనోహర్, ఎ.ఉదయభాస్కర్, సి.సుబ్బరాజు, హైమ, కేశవాచార్యులు, కె.సుబ్బారావు, అక్కింశెట్టి రాంబాబు, బి.లక్ష్మీనారాయణ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 94415 63789 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సికిల్ సెల్ నివారణకు స్క్రీనింగ్

కాకినాడ సిటీ: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సికిల్ సెల్ వ్యాధుల నివారణ, నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశం శనివారం కాకినాడ కోర్టుహాలులో ఆర్డీవో వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. 0–40 సంవత్సరాల ఉన్న వ్యక్తులను సర్వే చేసి సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ చేస్తారని డీఆర్వో తెలిపారు. సమావేశంలో డీఎల్‌టీవో డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్లు ఐ.ప్రభాకర్, ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ విల్సన్, ఇన్‌చార్జి ఎపిడమాలజిస్ట్ డాక్టర్ బి.రవికుమార్, జీజీహెచ్, విద్యాశాఖ, ఐసీడీఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత లేని సీసీ డ్రైన్ నిర్మాణం


కొత్తపల్లి ఊర చెరువు సెంటర్ నుంచి నిర్మిస్తున్న సీపీ డ్రైన్

కొత్తపల్లి: స్థాకంగా చేపడుతున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తపల్లి ఊర చెరువు సెంటర్ నుంచి సీసీ డ్రైన్ నిర్మిస్తున్నారు. ఈ పనులను కూటమి నాయకులు చేపట్టడంతో అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు అంటున్నారు. డ్రైన్ నిర్మాణానికి ఎటువంటి నిబంధనలు పాటించడంలేదని, డ్రైన్ అడుగు భాగంలో ఎటువంటి కొలతలు పాటించకుండా పనులు చేపడుతున్నారు. ఎంపీపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న ఈ పనులపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పనులు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని వివరణ కోరగా ప్రభుత్వ నిభంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.


ఎటువంటి నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న సీసీ డ్రైన్

సంపర మాజీ ఎమ్మెల్యే విగ్రహం ఏర్పాటు

కొత్తపల్లి: స్థానిక ఊరచెరువు సెంటర్‌లో సతీష్ చంద్ర భవనం సమీపంలో సంపర మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయి రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షుడు గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఉన్న దివంగత బుల్లెబ్బాయి రెడ్డి స్వగృహం వద్ద వర్ధంతిని ఆయన కుమారుడు అనిశెట్టి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు నాయకులు, గ్రామస్థులు, అభిమానులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.


బుల్లెబ్బాయిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు